క్లుప్తంగా

10న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట



ముత్యాలమ్మ దేవాలయం

రోలుగుంట: మండలంలో కొంతలం పంచాయతీ శివారు పాపంపేటలో ఈ నెల 10న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 8న పూజా కార్యక్రమాలు, 9న హోమం, చివరి రోజు విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 10న మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నర్సీపట్నం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నర్సీపట్నం మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం రెండో రోజు ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమమ్ టైం స్కేల్ తక్షణమే అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

137 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: వేసవిలో వృద్ధులు, చిన్నారులు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. గురువారం ఎ.కోడూరు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 137 మందికి సాధారణ వైద్యంతోపాటు బి.పి, సుగర్ పరీక్షలు చేశారు. 11 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి శైలజ సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్హెచ్పీ శాంతి, ఏఎన్ఎంలు లక్ష్మి, సంతోషి కుమారి పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు సన్యాసిరావు, వరహామూర్తి

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయాభివృద్ధికి దాతలు గురువారం విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన దొడ్డి దేముడు, ఈశ్వరమ్మ కుమారులు సన్యాసిరావు(వీఆర్పీ), వరహామూర్తి రూ.10 వేలు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, గ్రామపెద్ద గెంజి రాజేష్ కుమార్, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్, సరకులు పంపిణీ చేస్తున్న సమిధ సంస్థ ప్రతినిధులు

రావికమతం: చీమలపాడు పంచాయతీలో 460 మంది గిరిజన విద్యార్థులకు యలమంచిలికి చెందిన సమిధ సంస్థ ప్రతినిధులు విద్యా సామగ్రి గురువారం పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి డి. వీరభద్రరావు వివరించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. గిరిజన నాయకులు నల్లి కళ్యాణం, సమిధ సంస్థ కార్యకర్తలు కర్రి నాగేశ్వరరావు, అశ్విని, కిడారి లక్ష్మి, సిద్దాబత్తుల లక్ష్మి పాల్గొన్నారు.

'పది'లమైన ఫలితాలకు ప్రణాళిక

- 9 ఏళ్లుగా పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత
- ఈ విద్యా సంవత్సరం అదే లక్ష్యంతో కసరత్తు
- వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- ఆదర్శంగా నిలుస్తున్న ఎ.కోడూరు సమీకృత వసతిగృహం



పాఠ్యాంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న వసతి గృహాధికారి



ఎ.కోడూరు సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం

కె.కోటపాడు: పదో తరగతి ఫలితాల్లో పదో సారి శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఎ.కోడూరు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతిగృహ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఇక్కడ తొమ్మిదేళ్లుగా పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో శత శాతం ఉత్తీర్ణత సాధిస్తూ వస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలను సాధించి శభాష్ అనిపిస్తున్నారు. గతేడాది డిసెంబరు నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. టెస్టులు నిర్వహించి విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దారు. పరీక్షలంటే భయంలో పోయేలా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రోజూ ఉదయం, రాత్రి సమయాల్లో రీడింగ్, యోగా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇద్దరు ట్యూటర్లతో బోధన : ఇక్కడ వసతిగృహం పరిసరాలన్నీ ఆహ్లాదకరంగాను, పచ్చదనంతో ఉండడంతో పదో తరగతి విద్యార్థులు చదువులపై ఏకాగ్రత చూపుతున్నారు. ఇద్దరు వసతి గృహాధికారులతో పాటు ప్రత్యేకంగా నియమించిన ఇద్దరు ట్యూటర్లు రోజూ పర్యవేక్షిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ముందుండేందుకు ప్రత్యేకంగా బోధన అందిస్తున్నారు. పరీక్షల్లో ఆయా పాఠ్యాంశాలలో సులభంగా మార్కులు పొందేందుకు మెలకువలను నేర్పిస్తున్నారు. ఉదయం 4 నుంచి 6 గంటల వరకూ, రాత్రి 7 నుంచి 10 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీరి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పరీక్షలంటే భయపడి ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు రోజూ యోగా తరగతులను నిర్వహిస్తున్నారు.



వసతిగృహంలో విద్యార్థులకు రాత్రిళ్లు ప్రత్యేక రీడింగ్

తొమ్మిదేళ్లలో పది ఫలితాలు : ఎ.కోడూరు సమీకృత వసతిగృహం నుంచి 2015-16 విద్యా సంవత్సరంలో 10 మంది, 2016-17లో 48 మంది, 2017-18లో 54, మంది, 2018-19లో 55, 2019-20లో 55, 2020-21లో 10, 2021-22లో 40, 2022-23లో 35, 2023-24లో 46 మంది విద్యార్థులు చదవగా, వీరంతా ఉత్తీర్ణత సాధించారు. వీరిలో గత విద్యా సంవత్సరం వి.తనయ్‌కుమార్ అనే విద్యార్థి 553 మార్కులతో ఎ.కోడూరు హైస్కూల్‌లో టాపర్‌గా నిలిచాడు. 2018-19 విద్యా సంవత్సరంలో వసతి గృహ విద్యార్థి వి.శేషాద్రి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు.



కచ్చితంగా మెరిట్ మార్కులు సాధిస్తా



నేను ఎ.కోడూరులో సమీకృత వసతి గృహంలో పదో తరగతి చదువుతున్నాను. ఇక్కడ ఉదయం, రాత్రి సమయాల్లో ప్రత్యేక రీడింగ్ నిర్వహించడంతో పాటు పరీక్షలంటే ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు యోగా నేర్పిస్తున్నారు. ఇప్పటికే 11 రకాల పరీక్ష సామగ్రిని అందించారు. తప్పకుండా పది పబ్లిక్ పరీక్షల్లో మెరిట్ మార్కులు సాధిస్తాను. చదువుల్లో ఏమైనా సందేహాలు ఉంటే పాఠశాలలో ఆయా సబ్జెక్ట్ టీచర్‌ను పిలిపించి నివృత్తి చేస్తున్నారు.

– చరణ్‌కుమార్, పదో తరగతి విద్యార్థి, ఎ.కోడూరు

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



ప్రతి విద్యార్థిపైన వసతి గృహ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వసతి గృహంలో తొమ్మిదేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలలో వసతి గృహంలో చదువుతున్న 36 మంది శత శాతం ఉత్తీర్ణులు అయ్యేలా శక్తివంచన లేకుండా బోధన అందిస్తున్నాం. వీరికి మంచి పౌష్టికాహారం అందిస్తున్నాం.

–పి.గంగునాయుడు, సమీకృత వసతి గృహాధికారి, ఎ.కోడూరు

వేసవి జాగ్రత్తలు పాటించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో వైద్య సిబ్బంది బాధ్యతగా పని చేయాలని వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆమె తన సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు ఎండ తీవ్రత సమయంలో ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. దూర ప్రాంతాలకు ఉదయం, సాయంత్రమే ప్రయాణాలు చేయాలని, ఎండ తీవ్రత ఉన్న సమయంలో ఆరుబయట ప్రయాణిస్తే తీవ్ర ఇబ్బందులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

మాడుగుల రూరల్: అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో 2019 మార్చి 15వ తేది నాటికి ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తున్నట్టు తహసీల్దారు కె. రమాదేవి గురువారం తెలిపారు. జీవో నంబరు 30 ప్రకారం 150 గజాలలోపు స్థలంలో ఇల్లు కట్టుకున్న పేదలకు ఉచితంగా, అంతకంటే ఎక్కువ స్థలం కలిగిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రుసుం వసూలు చేసి క్రమబద్ధీకరిస్తామన్నారు. వీరికి గతంలో ఎటువంటి సొంత ఇల్లు ఉండకూడదన్నారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పార్టీ యూత్ అధ్యక్షుడికి ఘన సన్మానం

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పి.వెంకటేష్‌ను గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సన్మానించారు. యూత్ అధ్యక్షుడిగా నియమితులైన వెంకటేష్ మర్యాద పూర్వకంగా మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను కలిశారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తమరాన శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, మండల యూత్ నాయకుడు మాకిరెడ్డి రామకృష్ణంనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు పెట్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా యూత్ అధ్యక్షుడు వెంకటేష్‌ను శాలువతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ఘనంగా శివాలయం విగ్రహ ప్రతిష్ట



శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ధర్మశ్రీ



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి తదితరులు



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పూజలు చేస్తున్న సర్పంచ్ దంపతులు

చీడికాడ: అప్పలరాజుపురంలో మెట్టపై నిర్మించిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి నూతన ఆలయం, పరివార దేవతా విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా ముగిసింది. సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనూరాధ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, తదితరులు పాల్గొన్నారు.


శతశాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యం

మాడుగుల: మండలంలో జాలంపల్లి సచివాయ పరిధి ఎల్. కొత్తపల్లి గిరి గ్రామంలో శత శాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా పెట్టుకున్నామని వ్యవసాయాధికారి వాసుదేవరావు అన్నారు. గురువారం ఎల్. కొత్తపల్లిలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. రాబోయే తొలకరిలో ఇక్కడ రైతులందరితో అన్ని రకాల పంటలు ప్రకృతి సేద్యం విధానంలో పండించడానికి అవగాహన కల్పించామన్నారు. సహజ సిద్ధంగా దొరికే వనరులతో కషాయాలను, గోమూత్రం, ఆవు పేడతో తయారు చేసే ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. రసాయన ఎరువుల వల్ల నష్టాలు గురించి ప్రతి రైతు తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు


వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ



బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది మేజర్ పంచాయతీలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే అమ్మవారి పండగ ఆఖరి రోజు గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పులు, వాద్యాలు, నేల డ్యాన్స్, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత మధ్యన అమ్మవారి తిరునాళ్ల ఊరేగింపు సాగింది. రాత్రికి వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి. పలువురు నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కమ్మేసిన పొగమంచు

బుచ్చెయ్యపేట: వేసవిలోను పొగమంచు కప్పేస్తోంది. మార్చిలో ఎండలు మండుతున్నా మండలంలో రెండు రోజులుగా ఏజెన్సీని తలపించేలా పొగమంచు దట్టంగా కురుస్తోంది. దీన్ని కొంతమంది తమ సెల్‌ఫోన్లో బంధించగా, వాహనదారులు మాత్రం లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు.



బుచ్చెయ్యపేట రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

మాజీ మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



సర్పంచ్ రామకృష్ణ ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

రావికమతం: అనారోగ్యంతో బాధపడుతున్న గంపవానిపాలెం సర్పంచ్ రొంగలి రామకృష్ణను చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని రామకృష్ణ తన స్వగ్రామం చేరుకున్నారు. ఈ మేరకు ఆయన్ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అమర్ వెంట ఎంపీపీ పైల రాజు, పార్టీ అధ్యక్షుడు మహలక్ష్మీనాయుడు, మాజీ అధ్యక్షుడు కంచిపాటి జగ్గారావు నాయుకుడు ఆదిమూర్తి తదితరులు ఉన్నారు.

రికార్డులు లేని వాహనాలపై కేసులు

మాకవరపాలెం: రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. మాకవరపాలెంలో నర్సీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. హెల్మెట్ లేని, రికార్డులు సక్రమంగా లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: వెంకన్నపాలెం సబ్ స్టేషన్ మరమ్మతులు, లైన్లపై పడి ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనుల్లో భాగంగా శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బాలకృష్ణ గురువారం తెలిపారు.ఈ నేపథ్యంలో రామన్నపాలెం, భీమబోయినపాలెం ఫీడర్ల పరిధిలోని తొమ్మిది గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

8 గ్రామాలలో..

దేవరాపల్లి: ఎం.అలమండ, తారువ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఏఈ కె. శంకరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఎం. అలమండ ఫీడర్‌లోని ములకాలపల్లి, కొత్తపెంట, ఎం.అలమండ, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాలకు, తారువ ఫీడర్‌లోని తెనుగుపూడి, వెంకటరాజుపురం, గరిశింగి గ్రామాలకు అసౌకర్యం ఉంటుందన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

నాతవరం: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణతో పంచాయతీలకు అదాయం వస్తుందని పంచాయతీ విస్తరణాధికారి మూర్తి తెలిపారు. మర్రిపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రంలో గురువారం ఆయన వానపాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో కేంద్రాలు నిర్వహణ విధిగా చేయాలన్నారు. కేంద్రాల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువులు విక్రయించడంతో పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. దీంతోపాటు ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రతి ఇంటి నుంచి వీధుల్లో తడి, పొడి చెత్త సేకరించడం ద్వారా రోగాలు రాకుండా కాపడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మర్రిపాలెం చెత్త సంపద కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న సిబ్బంది

30లోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

కె.కోటపాడు: రైతులంతా ఈ నెల 30లోగా ఫార్మర్ రిజిస్ట్రీని పూర్తి చేసుకోవాలని ఏవో సోమశేఖర్ తెలిపారు. కె.కోటపాడు, సింగన్నదొరపాలెం రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూమి పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్‌తో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. మండలంలో 22 రైతు సేవా కేంద్రాల్లో 10,691 మంది రైతుల రిజిస్ట్రీని పూర్తి చేసినట్లు తెలిపారు. పీఎం కిసాన్ నగదు పొందుతున్న 8,400 మంది రైతులకు 4,950 మంది నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు రిజిస్ట్రీని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకుడు వరహాలదొర పాల్గొన్నారు.



కె.కోటపాడు రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీని పర్యవేక్షిస్తున్న ఏవో సోమశేఖర్

జిల్లా స్థాయి పోటీలకు కాశీపురం విద్యార్థుల ప్రాజెక్టులు

దేవరాపల్లి: ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఉన్నత పాఠశాల విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ పోటీలలో కాశీపురం విద్యార్థులు తయారీ చేసిన ప్రాజెక్టులు అబ్బుర పరిచాయి. స్థానిక పాఠశాల విద్యార్థి నక్క హరిప్రియ తయారీ చేసిన 'ఆన్ మైన్డ్ పెట్రోల్ బంక్ ప్రాజెక్టు' పోలిపల్లి ప్రదీప్ తయారీ చేసిన జెస్టర్ బేస్డ్ వైర్లెస్ రోబోట్ గేమింగ్ ప్రాజెక్టు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయని హెచ్ఎం పి.బి.టి. సుందరీ గురువారం తెలిపారు. ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయులు ఆర్.రామలక్ష్మి, బి.పూర్ణిమలను ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, ఉప సర్పంచ్ సింహాచలంనాయుడు, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు ఎ.వరలక్ష్మి అభినందించారు.

చెట్టుపల్లి విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక

నర్సీపట్నం: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కె.కార్తీక్ రూపొందించిన నమూనా ఎంపికైందని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ రాజుగోపాల్ తెలిపారు. విద్యార్థి రూపొందించిన క్యూ ఆర్ కోడ్ అద్దె కొరకు ప్రకటన బోర్డు సహాయంతో ముఖ్యంగా యజమానికి అద్దెకు దిగేవారికి మంచి వారిధిగా ఉపయోగపడుతుందని వివరించారు. దీని ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. తక్కువ స్థలంలో పేపర్ ప్రకటన ఇవ్వవచ్చునని, ఇంటి వీడియోను సైతం తిలకించవచ్చునని వివరించారు. విద్యార్థి కార్తీక్, ఉపాధ్యాయుడిని హెచ్ఎం రామకృష్ణ అభినందించారు.



ఇంటి అద్దె కోసం విద్యార్థి తయారు చేసిన క్యూ ఆర్ కోడ్ నమూనా

కంపు కొడుతున్న డ్రైనేజీలు

మాకవరపాలెం: డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజారావుపేటలోని చేపల మార్కెట్ పక్కనే డ్రైనేజీ పూర్తిగా చెత్త నిండి మూసుకుపోయింది. ఈ నేపథ్యంలో మురుగు కదలక దుర్గంధం వెలువడుతోంది. నెలల తరబడి డ్రైనేజీని శుభ్రం చేయకకుండా వదిలేశారు. ప్రతి మంగళవారం వారపు సంత రోజునే కాకుండా సాధారణ రోజుల్లోనూ చేపల వ్యర్థాలతో కూడిన నీటిని డ్రైనేజీలోనే వేస్తున్నారు. దీంతో వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అయినా పంచాయతీ అధికారులు డ్రైనేజీ శుభ్రం చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రిళ్లు దోమలతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని, వెంటనే డ్రైనేజీని శుభ్రం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.



చేపల మార్కెట్‌లో చెత్తతో నిండిపోయిన డ్రైనేజీ